ప్రజాశక్తి
ఆదివారం 1 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

సమైక్యతా యాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులు

దేశ సమగ్రత పరిరక్షణకు

సమైక్యతా స్ఫూర్తితో ముందుకు..

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకు సమైక్యతా స్ఫూర్తితో ప్రజలు ముందుకు సాగాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య అన్నారు. శనివారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 'ఐక్యంగా ఉగ్రవాదాన్ని ప్రతిఘటిద్దాం..' మత సామరస్యాన్ని ప్రజల ఐక్యతను కాపాడుకుందాం' అని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాపట్ల, పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన సమైక్యతా యాత్రలో ఆయన మాట్లాడారు. ప్రతీకారం పేరుతో ఉగ్రవాదులను వదిలిపెట్టి బాధితులు, లౌకికవాదులు మైనారిటీలపై బిజెపి ప్రభుత్వం విషం కక్కుతోందన్నారు. విచ్ఛిన్నకర మతోన్మాద శక్తులు ప్రజల ఐక్యతను చిన్నాభిన్నం చేయడానికి కంకణం కట్టుకున్నాయన్నారు .కొంతమంది రాజకీయ నాయకులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూ ప్రజల్లో చీలికలు తీస్తూ మతాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. కాశ్మీర్ ప్రజానీకం పదేళ్ల తర్వాత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సంపూర్ణ మద్దతు ప్రకటించి ఆ రాష్ట్రంలో బంద్ చేయడాన్ని గుర్తు చేశారు. గాయపడిన బాధితులకు సపర్యలు చేసి మానవత్వాన్ని చాటుకుంది స్థానిక ముస్లిములేనన్నారు. ఉగ్రవాద దాడిని పురస్కరించుకొని ఉగ్రవాదాన్ని ఏరివేస్తామని ప్రకటించిన ప్రధాని మోడీ.. ట్రంప్ మాటలు విని ఒక్క ఉగ్రవాదిని సైతం మట్టుపెట్టకుండా చేతులెత్తేశారన్నారు. యుద్ధాన్ని విరమించామని భారత్, పాకిస్తాన్లు ప్రకటించకుండానే ▶ 2లో

సమిష్టి కృషితో జిల్లా సమగ్రాభివృద్ధి

- తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు
- సమగ్రంగా మధ్యాహ్న భోజన పథకం అమలు
- జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- పలు తీర్మానాలు ఆమోదం
- సజావుగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, సమావేశంలో పాల్గొన్న జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజల సంక్షేమం, జిల్లా సమగ్ర అభివద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లాపరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. స్థానిక దక్షిణ బైపాస్‌రోడ్‌లోని పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. తొలుత పహల్గాం ఉగ్ర దాడిలో అమరులైన పర్యాటకులు, వీర జవాన్లకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

గ్రామీణ నీటి సరఫరా, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, విద్య, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా అందుతున్న సేవలపై సమావేశంలో చర్చించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపిపిలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. చీమకుర్తి బాలికల హాస్టల్‌లో మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉండటం లేదని, తినలేకపోతున్నామని విద్యార్థులు ఫిర్యాదు చేశారన్నారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలని విద్యా శాఖాధికారులను ఆమె ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాల శంకరరావు మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్నామని, సాగర్ నీటితో అన్ని నీటి చెరువులను నింపుతున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేసిందన్నారు. గుండ్లకమ్మ, రామతీర్థం, వెలిగండ్ల ప్రాజెక్టుల నుంచి జల్‌జీవన్ మిషన్‌లో చేపట్టిన పనులు కొనసాగుతున్నాయని, ఈ పనులను కేంద్ర నోడల్ అధికారులు గురు, శుక్ర వారాలలో జిల్లాలో పర్యటించి పరిశీలించినట్లు చెప్పారు. డ్వామా పీడీ జి.జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీలో ఈ ఆర్థిక సంవత్సరం లో ఇప్పటివరకు 54 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. జిల్లాలో పశువులకు నీటి తొట్టెలు, గోకులం షెడ్లులు, ఫారం పాండ్స్, సోక్ పిట్స్ నిర్మాణాల పురోగతిని, పూడికతీత పనుల వివరాలను వివరించారు. పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన పనులకు బిల్లులు వారం రోజులలో చెల్లిస్తామని తెలిపారు. డిఆర్‌డిఎ పీడీ నారాయణ మాట్లాడుతూ మహిళలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరు లక్ష్యాన్ని 100 శాతం పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో లఖ్‌పతి దీదీలుగా మహిళలను తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలు తెరవగానే ▶ 2లో

మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు సిఎంగా తగడు..

▲ 8లో

'వెన్నుపోటు దినోత్సవం' ప్రకటించటం సిగ్గుచేటు

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- చిలంకూరులో పింఛన్ల పంపిణీ

పింఛన్ అందజేస్తున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-మర్రిపూడి

ఇచ్చిన హామీలను సిఎం చంద్రబాబు నాయుడు అమలు చేస్తుంటే వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి జూన్ 4ను వెన్నుపోటు దినోత్సవంగా జరుపుతామని ప్రకటించడం సిగ్గుచేటని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిలంకూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో వికలాంగులు, వయో వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడు తున్న వారందరికీ ఇంటింటికీ తిరిగి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు చీత్కరించి 11 సీట్లిచ్చారని చెప్పారు. ప్రజలు జగన్మోహన్‌రెడ్డికి అధికారమిస్తే ఆయన వారికి వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి 'తల్లికి వందనం' కింద ▶ 2లో

'ఎవరో తప్పు చేస్తే.. నాకు అంటగడుతున్నారు..?'

'పచ్చ నేతలు..పచ్చమేతలు' అని ఓ పేపర్లో రాశారని, ఎవరో తప్పు చేస్తే నాకు అంటకడుతున్నారని మంత్రి స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఐదేళ్ల కాలంలో జరిగిందే కదా.? అని ఆరోపించారు. అధికారం ఉన్నప్పుడు రాయకుండా లేనప్పుడు రాసి ప్రజలకు అసత్యాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఏం రాసినా నాకేమీ కాదన్నారు. తప్పులు చేసినవాళ్లు శిక్షించబడతారని చెప్పారు.

రోడ్డెక్కిన పొగాకు రైతులు

- ఎఫ్-3 బేళ్లను నోబిడ్లుగా చూపడంపై నిరసన
- వేలాన్ని బహిష్కరించి..రాస్తారోకో

రాస్తారోకో చేస్తున్న పొగాకు రైతులు

ప్రజాశక్తి-కొండపి

ఎఫ్-3 బేళ్లను నోబిడ్లుగా చూపడంపై పొగాకు రైతులు శనివారం రాస్తారోకో చేశారు. కొండపిలోని పొగాకు వేలం కేంద్రానికి శనివారం మూగచింతల, నెన్నూరుపాడు, గురప్పడియా, కె.అగ్రహారం, చతుకుపాడు గ్రామాలకు చెందిన రైతులు వేలానికి పొగాకు బేళ్లను తీసుకొని వచ్చారు. కొనుగోలు ప్రారంభం నుంచి ధరలు డిస్‌ప్లే బోర్డు మీద కనిపించాల్సి ఉండగా ఒక లైను పొగాకు కొనుగోలు అయ్యే వరకూ డిస్‌ప్లే మీద ధరలు కనిపించలేదు. వేలం ప్రారంభంలో లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేశారని, వేలం కొనసాగుతూ ముందుకు పోతున్న కొద్దీ.. ఎఫ్-3 పొగాకు బేళ్లను నోబిడ్లుగా చూపిస్తున్నారని రైతులు ఆందోళన చేశారు. వేలాన్ని బహిష్కరించి బయటికి వెళ్లారు. అనంతరం కొండపి-టంగుటూరు రోడ్డులో రాస్తారోకో చేశారు. వేలం నిర్వహణ అధికారి రైతుల పక్షాన నిలిచి వ్యాపారులతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కొనుగోలు ప్రారంభించాలని నినాదాలు చేశారు. మీ సమస్యలను వేలం నిర్వహణ అధికారితో చర్చించి పరిష్కరించుకోవాలని ఎస్ఐ ప్రేమ్ కుమార్ రైతులకు సూచించారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. రైతుల ఆందోళనకు రైతు కూలీ సంఘం ▶ 2లో

కూలీలతో మాట్లాడుతున్న మాలకొండయ్య

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-వెలిగండ్ల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని జిల్లా సిఐటియు నాయకులు రాయళ్ల మాలకొండయ్య డిమాండ్ చేశారు. శనివారం రామగోపాలపురంలో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. దాదాపు 7 వారాల నుంచి బిల్లులు రావడంలేదని కూలీలు తెలిపారు. వేసవి కాలంలో పెళ్లిళ్ల, తిరునాళ్ల వగైరా ఖర్చులు పెరిగాయని పెండింగ్ బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని మాలకొండయ్య అన్నారు.

'వెన్నుపోటు దినోత్సవం' ప్రకటించడం సిగ్గుచేటు

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున పాఠశాలకు వెళ్లే సమయానికి డబ్బులు వేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలందరికీ ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో గత టిడిపి ప్రభుత్వం హయాంలో వేసిన రోడ్లే నేటికీ దిక్కయ్యాయన్నారు. వైసిపి ఐదేళ్ల కాలంలో ఒక్క రోడ్డు కూడా ముట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, మండల పరిషత్ అభివద్ధి అధికారి ఎం.జగదీష్, తహశీల్దార్ జ్వాలా నరసింహం, పార్టీ మండల అధ్యక్షులు చేరెడ్డి నర్సారెడ్డి, టిడిపి నాయకులు రేగుల వీరనారాయణ, మాజీ జెడ్పిటిసి తుళ్లూరి వెంకట నరసింహం, నాయకులు గొంటు హనుమారెడ్డి, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత పరిరక్షణకు సమైక్యతా స్ఫూర్తితో ముందుకు..

(మొదటిపేజీ తరువాయి)

ట్రంప్ ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. దీన్ని ఆసరాగా చేసుకుని అమెరికా తన పెత్తనాన్ని ప్రపంచానికి చాటుకుందన్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో తెలుగుదేశం, వైసిపి, జనసేన, కాంగ్రెస్ పార్టీలు వాస్తవాలు వివరించకుండా మతోన్మాదానికి మద్దతు పలుకుతున్నాయన్నారు. దేశ సమైక్యత, సమగ్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీల విధానాలను ముక్తకంఠంతో వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కష్ణమోహన్, పి. కొండయ్య, సిఐటియు నాయకులు శరత్, పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, కె. నాగేశ్వరరావు, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి బుర్రి ఆంజనేయులు, ఆదిశేషు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన పొగాకు రైతులు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కార్యదర్శి లలిత కుమారి, జిల్లా సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు మద్దతు తెలిపారు. రైతులు మాట్లాడుతూ కొంతమంది రైతుల దగ్గర వ్యాపారులు డబ్బులు తీసుకొని వారి బేళ్లను మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, మిగతా వారి బేళ్లను తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. వేలం ప్రారంభంలో ఒక రైతుకు సంబంధించిన లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేశారని, వేలం ముందుకు వెళుతున్న కొద్దీ ఎఫ్-3 బేళ్లను ను కూడా నోబిడ్ పెట్టి కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. వేలం ప్రారంభంలో లో గ్రేడ్ పొగాకును కేజీ రూ.240తో ప్రారంభించారని, నాలుగో రౌండ్ చివరి దశ నుంచి లోగ్రేడ్ పొగాకు రూ.200కు పడిపోయిందని, ఈ రకంగా కొనుగోలు జరిగితే తీవ్రంగా నష్టపోతామని అన్నారు.

ఎట్టకేలకు ప్రారంభమైన వేలం

రైతులతో పలుదఫా చర్చలు జరిపిన అనంతరం బోర్డు నిర్వహణ అధికారి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా బయ్యర్లతో మాట్లాడతామని హామీ ఇవ్వడంతో రైతులు అంగీకరించి.. వేలానికి మొగ్గు చూపారు.అనంతరం ఆగిన చోట నుంచి వేలం తిరిగి ప్రారంభమైంది.

పిడిసిసి బ్యాంకు పూర్వ వైభవానికి కృషి చేస్తా

చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కామేపల్లి సీతారామయ్య

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(పిడిసిసిబి)కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య పేర్కొన్నారు. స్థానిక పిడిసిసి బ్యాంకు ఆవరణలో శనివారం జిల్లా సహకార అధికారి ఇందిరా దేవి నుంచి చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా సహకార అధికారి ఇందిరా దేవి, పిడిసిసి బ్యాంకు సిఇఒ కుంభా రాఘవయ్య ఘనంగా సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు. అనంతరం డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నామినేటెడ్ పదవిని కేటాయించారని, వారి ఆశయాలు, ఆశలకు అనుగుణంగా బ్యాంకును

బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ కామేపల్లి సీతారామయ్య

అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు అనుమతి తీసుకొని శనివారం బాధ్యతలు చేపట్టామన్నారు. బ్యాంకులోని అందరికీ సహకరిస్తానని, ప్రతి ఒక్కరి సలహాలు తీసుకుంటానన్నారు. నెల రోజులలో బ్యాంకు వ్యవస్థ స్వరూపాన్ని తెలుసుకుని అందుకు అనుగుణంగా బ్యాంకు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, బ్యాంకు అధికారులతో కలసి సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. పదవి ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఎమ్మెల్యేలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి సహకారంతో పిడిసిసి బ్యాంకును ఉన్నత స్థాయికి తీసుకెళ్ళేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. డాక్టర్ కె.సీతారామయ్యను ఏఎంసి మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, పిడిసిసి బ్యాంకు డిజిఎం ప్రకాశ్, ఏజిఎంలు, బ్యాంకు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షులు ప్రసన్న రాజు టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విపత్తు నిర్వహణపై ప్రణాళికలు రూపొందించాలి

జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విపత్తు నిర్వహణపై అధికారులు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి కోరారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ నుంచి సమాచారం అందిందన్నారు. పంట కాల్వలు, చప్టాలు, చెక్ డ్యాములు ఎలా ఉన్నాయో పరిశీలించాలన్నారు. కాల్వలు, చెరువు కట్టలు బలహీనంగా ఉన్న వాటిని గుర్తించి బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికంగా వర్షాలు కురిస్తే పట్టణ ప్రాంతాలలోని మురికి కాల్వలోని మురుగు రహదారులపై పొర్లిపారే అవకాశం ఉన్నందున ముందస్తుగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. మలేరియా, డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకకుండా ముందుగానే నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తదుపరి ఆర్డీవోలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. తుపాను హెచ్చరిక నేపథ్యంలో

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

గ్రామ స్థాయిలో విపత్తు నిర్వహణ కమిటీలను అధికారులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. బాపట్ల జిల్లాలో ఆరు మండలాలలో 31 గ్రామాలు తీర ప్రాంతంలో ఉన్నాయన్నారు. 83 ఆవాస ప్రాంతాలలో ప్రజలు నివాసం ఉంటున్నారని చెప్పారు. ఆకస్మికంగా 20 ఎంఎం వర్షం కురిస్తే దిగువ ప్రాంతాలలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ముందస్తుగానే నిల్వ చేసుకోవాలని ఆదేశించారు. విపత్తు నిర్వహణపై అధికారుల ప్రణాళికలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో బాపట్ల, చీరాల ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, ఉప కలెక్టర్ లవన్న, పర్యవేక్షకులు షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే జిల్లా సమగ్రాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

"సర్వేపల్లి రాధాకష్ణ విద్యార్థి మిత్ర' కిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, "మన బడి మన భవిష్యత్తు" కార్యక్రమంలో పాఠశాలలలో అవసరమైన పనులు చేపడతామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ 'అన్నదాత సుఖీభవ' పథకంలో లబ్ధిదారుల ఖాతాలలో జూన్ 3వ వారంలో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందన్నారు. ఇటీవల వర్షాలకు పంటలు దెబ్బతిన్న ఉద్యాన రైతులకు ప్రభుత్వం తరపున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి జెసి ఆర్.గోపాలకృష్ణ

సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను, సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని జెసి ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. విద్యా హక్కు చట్టం అమలు, అర్హతలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాస ప్యాకేజీ జాబితాలో పేర్లు లేని వారి అర్హతను పరిశీలించేందుకు గ్రామసభలు పెట్టామన్నారు. అర్హులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రస్తుతం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా పాల్గొని యోగా సాధన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కరోనా కేసులు పెరుగుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వారికి సూచించారు.

పలు తీర్మానాలు ఆమోదం

జడ్పీ సర్వ సభ్య సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. జడ్పీ సిఇఒ బి.చిరంజీవి మాట్లాడుతూ సవరించిన మార్గదర్శకాల మేరకు స్టాండింగ్ కమిటీ, మండల పరిషత్ ఆమోదించే పనుల అంచనాల విలువను రూ.5 నుంచి 10 లక్షలకు, జిల్లా పరిషత్ ఆమోదించే పనుల అంచనాల విలువను రూ.10 లక్షల నుంచి 25 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. కొత్త జడ్పీ సమావేశ మందిరం నిర్మాణానికి గతంలో రూపొందించిన రూ.20 కోట్ల అంచనాలను సవరించేందుకు, గత రెండు స్టాండింగ్ కమిటీలలో ఆమోదించిన 350 ప్రతిపాదనలకు కూడా ఈ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో ప్రకాశం సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, బాపట్ల, నెల్లూరు జిల్లాల రెవెన్యూ అధికారులు జి. గంగాధర్ గౌడ్, ఉదయ భాస్కర్, వివిధ శాఖల అధికారులు, జడ్పీటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **POTUGANTI KISHORE KUMAR** (Old name), S/o **POTUGANTI RADHA KRISHNA MURTHY**, Resident of Door No. 3-27-8, Anuradha Nilayam, House No-4, Satyanarayanapuram, Balakrishna puram, Ongole, Prakasam District -523001, Andhra Pradesh, India. I, have Changed my name as **POTHUGANTI KISHORE KUMAR** (New Name) S/o **POTHUGANTI RADHA KRISHNA MURTHY**, Hereafter my name is known as **POTHUGANTI KISHORE KUMAR** (New Name) S/o **POTHUGANTI RADHA KRISHNA MURTHY.**

CHANGE OF NAME

I, **Thatipamula Vijay Tej,** S/o. Thatipamula Nagarjuna Babu, residing at 2-231, Nehru Colony 3rd Line, Opp.Padmavathi Functional hall, Guntur Road, Ongole, Prakasam District, Andhra Pradesh, India - 523001. have changed my Father's Name from **Thatipamula Vijay Tej, S/o. Thatipamula Nagarjuna Babu** (Old Name) **to Thatipamula Vijay Tej, S/o. Thatipamula Nagarjuna** (New Name) as per affidavit dated **09-05-2025** before public Notary, Ongole.

పేరు మార్పు / సవరణ

నేను కోట నాగరాజు, S/o కోట వెంకటరావు, నివాసం : 9-144, పర్చూరు, బాపట్ల జిల్లా. నా యొక్క కుమార్తె పేరు ప్రస్తుతం ఆధార్‌కార్డులో కోట చెన్విత శ్రీ నాగ వేద అక్షయ అని ఉన్నది. ఇప్పుడు జ్యోతిష్యం ప్రకారం పేరు సవరణ చేయగా **కోట చెన్విక అక్ష రాయల్ D/o కోట నాగరాజు (KOTA CHENVIKA AKSHA ROYAL D/o KOTA NAGA RAJU)** గా మార్పు చేయటం జరిగినది. ఈ రోజు నుండి నా కుమార్తె పేరు **కోట చెన్విక అక్ష రాయల్** గా పిలవబడును. ఆధార్‌లో మారు కొరకు.

మహారాజశ్రీ

మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. 14/2025

గుంటక నరోత్తంరెడ్డి ..... వాది

వర్సెస్

పోరెడ్డి వెంకట రమణారెడ్డి ...... ప్రతివాది

టు,
పోరెడ్డి వెంకట రమణారెడ్డి, తండ్రి: అల్లూరిరెడ్డి,
డోర్ నెం: 1-168, బోడపాడు గ్రామం,
మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

ఈ నెంబరు వాది దావా ప్లయింట్ పరిహారం రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసియున్నారు. ఈ దావాలో పిటీషన్ దాఖలా షెడ్యూలు ఆస్తిని నీవు అన్యాక్రాంతము చేయకుండా ఉండుటకు కోరి ఐ.ఎ.163/2025 ఇన్ ఓ.ఎస్ 14/2025గా దాఖలు చేసియున్నారు. సదరు దావా మరియు ఐ.ఎ.లో నీవు కోర్టుకు హాజరగుటకు 20-06-2025వ తేదీకి వాయిదా వేయడమైనది. ఆ రోజు ఉదయం గం|| 10:30 ని|| లకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసిది. లేని యెడల నీ పరోక్షమందు సదరు దావా మరియు ఐ.ఎ.లను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 20-06-2025

మార్కాపురం **టి.శివప్రసాద్**

అడ్వకేట్, మార్కాపురం.

ఐడిఎఫ్‌సి బ్యాంకు బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలులో ఐడిఎఫ్‌సి బ్యాంకు తొలి బ్రాంచిని పోస్ట్ ఆఫీస్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు జోనల్ మేనేజర్ వేణుగోపాల రాజు మాట్లాడుతూ బ్యాంక్ సేవింగ్ అకౌంట్‌పై అత్యధిక ఏడు శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. డెబిట్ కార్డ్ ద్వారా రోజుకు రూ రెండు లక్షలు డ్రా చేసుకొనే సౌకర్యం ఉన్నట్లు తెలిపారు. తమ బ్యాంకు ద్వారా జనరల్ ఇన్సూరెన్స్, వెహికల్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్, టర్మ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా అందుబాటు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరి క్లబ్ ప్రెసిడెంట్ చంద్రమోహన్ రెడ్డి, సెక్రటరీ రాఘవ, భగీరథ కెమికల్స్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, హోటల్ అధినేత బొమ్మిశెట్టి లక్ష్మీనారాయణ, కిమ్స్ వైద్యులు డాక్టర్ అనిల్, జోనల్ హెచ్‌ఆర్ మేనేజర్ ఆదిత్య రీజనల్ జిబిజి హెడ్ శ్రీనివాసరావు, కె. గోపికృష్ణ క్లస్టర్ మేనేజర్ సందీప్, మేనేజర్ గోరంట్ల శ్రీనివాసరావు, న్యాయవాదుల నరసింహారెడ్డి, అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పిఎస్ హెచ్‌ఎం (ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్స్) ప్రమోషన్ల కోసం చేపట్టిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఖాళీగాఉన్న 68 పిఎస్ హెచ్‌ఎం (ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్స్) పోస్టులకు శనివారం ఒంగోలు నెల్లూరు బస్టాండ్ సమీపంలోని డిఆర్‌ఆర్‌ఎం స్కూల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.కిరణ్ కుమార్, డిప్యూటీ డిఇఒ చంద్రమౌళి, ఎంఇఒ కిషోర్ బాబు పర్యవేక్షణలో నిర్వహించారు. జిల్లా పరిషత్ యాజమాన్యం కింద 46, ప్రభుత్వ యాజమాన్యం కింద 3, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యం కింద ఏడు, మున్సిపల్ యాజమాన్యం కింద 12 ఖాళీలకు 1:3 చొప్పున సెకండరీ గ్రేడ్ టీచర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. వీరికి ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు డిఇఒ తెలిపారు.

గృహ ప్రవేశ వేడుకల్లో మంత్రి స్వామి

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని చల్లగుంట్ల వారి నూతన గృహ ప్రవేశ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎఎంసి మాజీ చైర్మన్ రామయ్య చౌదరి, బత్తుల నారాయణస్వామి, నర్సారెడ్డి, తిప్పారెడ్డి కష్టారెడ్డి, బోదవాడి సోమయ్య,నన్నూరి .సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలో పనిచేసే ఇంజినీరింగ్ కార్మికులను టెక్నికల్ ,నాన్ టెక్నికల్ కింద విభజించి వారికి నెలకు జీతం రూ.29,500, రూ. 24,500 చెల్లించాలని కోరారు. 15 సంవత్సరాలకు పైబడి పని చేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. 55 ఆదివారాలు, 17 దేశ, జాతీయ రాష్ట్ర పండుగ లేను కలుపుకొని 72 రోజులు సెలవులుగా ప్రకటించాలన్నారు. లేనిపక్షంలో వేతన దినాలుగా ప్రకటించాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా , అంగవైకల్యం పొందిన వారికి రూ. 5లక్షలు ఎక్స్ గ్రేషియా ఇచ్చి వారి

ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు కె.రాఘవేంద్రరావు, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు బి. శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు అంబటి విజయ్, టి. సురేష్, కె. మోహన్ రావు, రవి కాంత్ , ప్రణీత్, శ్రీకాంత్, అజయ్ బాబు, పి. మోజెష్, వైకె.శ్రీనివాసరావు, ఎన్. బ్రహ్మానంద రెడ్డి, టి. తులసిరామ్, ఎం.సునీంద్రబాబు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే ప్రజల మన్ననలు

ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నిబద్ధతతో పనిచేస్తే ఆ అధికారులు ప్రజల మన్నలు పొందుతారని ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్ తెలిపారు. ఎంపిడిఒ వై. మహాలక్ష్మి ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సన్మానసభ నిర్వహించారు ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపిడిఒ మహాలక్ష్మి ఇక్కడ ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన కొద్దికాలంలోనే అందరినీ సమన్వయం చేసుకుంటూ మండలాభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్నలు పొందారన్నారు. జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు మాట్లాడుతూ తాను జిల్లాపరిషత్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో మహాలక్ష్మి లింగసముద్రం ఎంపిడిఒగా పనిచేసినట్లు తెలిపారు. ఆమె ఎంతో ధైర్యశాలి అని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ ఎంపిడిఒ మహాలక్ష్మి క్రమశిక్షణతో పనిచేసి ప్రజాసమస్యలను పరిష్కరించడంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. సన్మాన గ్రహీత మహాలక్ష్మి మాట్లాడుతూ తాను 17 సంవత్సరాల పాటు ప్రకాశం జిల్లాలోనే పనిచేసినట్లు

ఎంపిడిఒ మహాలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

తెలిపారు. అనంతరం ఎంపిడిఒ మహాలక్ష్మి, మోహన్ కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎంఇఒ రవి, నలమలపు కష్టారెడ్డి , కస్టర్ ఇన్‌ఛార్జులు గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మీవరప్రసాదు డిప్యూటీ ఎంపిడిఒ మురళీమోహన్, సూపరింటెండెంట్ దక్షిణామూర్తి ,ఎపిఒ రవిబాబు, వివిధ గ్రామాల సర్పంచులు ,కార్యదర్శులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపిపి నలమలపు అంజమ్మ కష్టారెడ్డి దంపతులు తమసొంత నిధులతో మండలపరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల విగ్రహాలను ఎమ్మెల్యే విజయకుమార్ చేతులమీదుగా ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైకు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చింతగుంట్ల గ్రామ సమీపంలో అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. తిప్పాయపాలెం గ్రామానికి చెందిన కుందూరు చిన్న కాశి నారాయణరెడ్డి (32) మార్కాపురంలోని ఫ్యూజ్ కాల్ కార్యాలయంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు లాగే శనివారం మధ్యాహ్నం విధులు ముగించుకొని బైకుపై ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో నారాయణరెడ్డి అక్కడికక్కడే మతి చెందాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ ఎస్ఐ పి. అంకమ్మరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి చిన్న పోలిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంకమ్మరావు తెలిపారు.

పొన్నలూరు పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి - పొన్నలూరు : పొన్నలూరు ప్రాథమిక వైద్యశాలను డి ఎంహెచ్ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో రోగులకు అందుతున్న చికిత్స, వైద్య సిబ్బంది పనితీరు, మందులు సదుపాయాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఒపి సమయంలో వైద్యులు పూర్తి సమయం అంద ుబాటులో ఉండాలన్నారు, కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రవికిరణ్,డాక్టర్ కృష్ణ చైతన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర యూత్ వింగ్ జాయింట్ సెక్రెటరీగా మహానంది రెడ్డి

ప్రజాశక్తి -ముద్దిపాడు : వైసిపి రాష్ట్ర యూత్ వింగ్ జాయింట్ సెక్రెటరీగా మండల పరిధిలోని నేలటూరు గ్రామానికి చెందిన పాకనాటి మహానంది రెడ్డి నియమితుల య్యాడు. పార్టీ ఆవిర్భావం నుంచి వైసిపికి

ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రెటరీగా ఆయన్ని నియమించారు.. తనపై నమ్మకంతో పదవిని కేటాయించిన మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డికి, వైసిపి నాయకులకు ఈ సందర్భంగా మహానంది రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు

ఘనంగా శిద్దా వివాహ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు లక్ష్మీ పద్మావతి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు సేవా కార్యక్రమాలతో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక హరిహర క్షేత్రంలో గోల్డెన్ గ్రానైట్స్ జనరల్ మేనేజర్ ఎ. గిరిబాబు, కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు దంపతులు తమ కుమారుడు శిద్దా సుధీర్ కుమార్‌తో కలిసి అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. తొలుత శిద్దా రాఘవరావు దంపతులకు ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సముదాయంలోని దేవాలయాలలో శిద్దా రాఘవ దంపతులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి గ్రానైట్స్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేశారు.

సేవా కార్యక్రమాలు నిర్వహణ:

శిద్దా రాఘవరావు దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఓ, గిరిబాబు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శిద్దా రాఘవరావు దంపతులు చేతుల మీదుగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాటిమీద పాలెం విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద మహిళలకు ఏడాదికి సరిపడ

కేట్ చేస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు

మందులను అందజేశారు. ఇంటి నిర్మాణం సిమెంటు కోసం ఇద్దరు మహిళలకు ఆర్థిక సహాయం అందజేశారు. వేద పండితులు 12 దంపతులకు వస్త్ర దానం చేసి ఘనంగా సత్కరించారు. ఎస్‌కెఆర్ బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ అంజిరెడ్డి దంపతులను సత్కరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అనంతరం శిద్దా రాఘవరావు దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిని ప్రముఖ వ్యాపార వేత్తలు శిద్దా సుధీర్ కుమార్ ,శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా ప్రకాష్‌రావు, శిద్దా హనుమంతరావు, శిద్దా సుధాకర్, శిద్దా పవన్ కుమార్, శిద్దా ఆంజనేయ ప్రసాద్, శిద్దా పెదబాబు, శిద్దా సాయిబాబు, శిద్దా బాలాజీ, శిద్దా సురేష్ ,మండవ ఎక్స్‌పోర్ట్ అధినేతలు మండవ శ్రీనివాసరావు, మండవ గోపి,

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న శిద్దా దంపతులు

టిడిపి నాయకులు కాట్రగడ్డ రమణయ్య, మన్నం ప్రసాదు, కందిమళ్ళ గంగాధర్ రావు, గొల్లపూడి కోటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కొత్తపు రాఘవరావు, గోగినేని శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, గ్రానైట్ బయ్యర్లు నల్లూరి సత్యనారాయణ, ఆర్‌పి.రవి, పిఎస్‌ఎన్. మూర్తి, మండవ శ్రీనివాసరావు, ఆళ్ల రవి, ఎర్రగుంట్ల చంద్రశేఖరు, ముళ్ళమూరు మాజీ ఎంపీపీ మండల వెంకట్రావు, టిడిపి అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, సుదర్శన గ్రానైట్ అధినేత నూనె వెంకటసుబ్రహ్మణ్యం, ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీ నారాయణ, బొమ్మిశెట్టి కిరణ్, గ్రంధి శ్రీహరి, నూకల సురేంద్ర, సిహెచ్.హనుమంతరావు, ఆర్యవైశ్య సంఘం మహిళా నాయకురాలు కొణిజేటి సువర్ణ, అరుణ, పద్మ ,సుభాషిణి, ఆర్యవైశ్య మరియు వాసవీ క్లబ్ సభ్యులు ఉన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ మాగుంట

పింఛన్లు పంపిణీ చేసిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్ : స్థానిక 15వ డివిజన్ రామ్ నగర్ ఒకటి ,రెండు లైన్లలో సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం పాలనలో పింఛను లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ చింతపల్లి గోపి, టిడిపి నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఎంపి మాగుంట

యోగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యోగాంధ్ర -2025 మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి పిలుపు నిచ్చారు. ఒంగోలులోని పాత జడ్పి సమావేశ మందిరంలో ఆయన యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా తన పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాంధ్ర క్యాంపెయిన్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని యోగాంధ్ర -2025 మాసోత్సవాల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఈఓ బి చిరంజీవి, డ్వామా పీడీ జి జోసెఫ్ కుమార్, బిసి కార్పోరేషన్ ఈడి ఎం వెంకటేశ్వరరావు, స్టెప్ సిఈఓ పి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఇందిరా కుమారిని సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు

'ఇందిరా' సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సమాచార శాఖలో సుమారు 38ఏళ్లపాటు టైపిస్టుగా విధులు నిర్వహించి శనివారం ఉద్యోగ విరమణ చేసిన ఓ.ఇందిరా కుమారికి సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు ఘన వీడ్కోలు పలికారు. మార్కాపురం డివిజన్ కార్యాలయంతో పాటు ఒంగోలులోని జిల్లా కార్యాలయంలో ఆమె విధులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఒంగోలులోని జిల్లా కార్యాలయంలో సన్మాన చేశారు. ఆమెతో కలిసి పనిచేసిన అనుభవాలను ఉద్యోగులు, సిబ్బంది గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిఐపిఆర్ఓ వేణుగోపాల్, డిపిఆర్ఓ రమేష్, డివిజనల్ పిఆర్ఓ డి.దుర్గాప్రసాద్, రిటైర్డ్ డిఈఈఈ రమణమూర్తి, విశ్రాంత డిపిఆర్ఓ నారాయణ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి వైద్యశాల సంయుక్తంగా శనివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి 200 మంది హాజరైనట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేషా వలి, డాక్టర్ బత్తుల వీరనారాయణ తెలిపారు. ఈ శిబిరానికి 200మంది హాజరు కాగా అందులో 140మందికి కంటి శుక్లంల ఆపరేషన్లు చేయాలని వైద్యులు నిర్ణయించినట్లు తెలిపారు. ఇంతకు ముందు కంటి ఆపరేషన్లు చేయించుకున్న 100మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేసినట్లు చెప్పారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గత రెండు దశాబ్దాలుగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిబిరంలో డాక్టర్ శ్యామ్ దీప్, డాక్టర్ రమ్యా కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శంకర్ కంటి హాస్పిటల్ ఇంచార్జి డాక్టర్ గంగాధర్, రోటరీ సభ్యులు రాయిని రామారావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కరణం హనుమంతరావు, తాటి చిన సుబ్బారావు, ప్రొఫెసర్ బండారుపల్లి రమేష్, బాచిన వెంకట రామారావు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం కాపాడుకోవచ్చు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

యోగ సాధన వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, అందరూ యోగ సాధన చేయాలని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయ ఆవరణలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన భారతదేశం గర్వించదగిన ప్రక్రియ యోగా అని అన్నారు. మన పూర్వీకులు, మహర్షులు వేల ఏళ్ల క్రితం యోగాను అభివృద్ధి చేసి ఒక పాఠ్యాంశంగా కొనసాగే విధంగా ప్రపంచానికి అందించారని అన్నారు. జీవితకాలం అంతా యోగాను అనుసరిస్తూ, చేస్తూ జీవితాన్ని ఆరోగ్య పరంగా తీర్చిదిద్దుకోవడానికి పనికివచ్చే సాధనమని అన్నారు. మంచి ఆరోగ్యాన్ని, మంచి జీవన సరళిని మెరుగు పర్చుకోవడానికి యోగాను అలవర్చుకోవాలని అన్నారు. యోగ సాధన వల్ల ఇమ్యూనిటీ శక్తి పెరుగుతుందని అన్నారు. జీవనశైలిలో వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్, ప్రోటోజువా మొదలగు వాటి వలన సంక్రమించే వ్యాధులను యోగా సాధన వలన ఎదుర్కోవచ్చని అన్నారు. బిపి, షుగర్, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, వెన్నుపూస సంబంధిత వ్యాధులను యోగా ద్వారా తగ్గించుకోవచ్చని తెలిపారు. జిమ్‌ల కంటే యోగా వలన మనిషిలో జీవకళ, ధైర్యం, మనసుకు ప్రశాంతత లభిస్తుందని అన్నారు. యోగా గురువు చేత శిక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యోగాలో పాల్గొన్న కలెక్టర్ వెంకట మురళి

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాల్సి మే 31న నిర్వహించు కుంటున్నామని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వలన ఊపిరితిత్తులకు సంబంధించిన ఆస్తమా, క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు వస్తాయని తెలిపారు. ఎవరైనా ధూమపానం సేవించినా, ఆ వాసనను పీల్చినా పొగ తాగే వారి లెక్కలోకి వస్తారని అన్నారు. పాన్, గుట్కా మొదలగు వాటిని సేవించిన క్యాన్సర్‌కు గురవుతారని అన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలతో పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, పిడి డిఆర్డిఎ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, బాపట్ల ఆర్‌డిఓ పి గ్లోరియా పాల్గొన్నారు.

ప్రీమియంలపై జిఎస్‌టిని రద్దు చేయాలి

ప్రజాశక్తి - చీరాల

కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసిని ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తించి ప్రీమియంలపై జీఎస్టీ రద్దు చేయాలని ఐసిఇయు నాయకులు కోరారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ 38వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి నెల్లూరు డివిజన్ అధ్యక్షులు పి సుందరబాబు, నెల్లూరు డివిజన్ జనరల్ సెక్రటరీ డి ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఎస్ మంజులా హాజరైయ్యారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రసిడెంట్‌గా టి విజయ్ కుమార్, వైస్ ప్రసిడెంట్ సిహెచ్ హరిప్రసాద్, సెక్రటరీ ఆర్‌విఎస్ రామిరెడ్డి, జెయింట్ సెక్రటరీ వై పూర్ణచంద్రరావు, ట్రెజరర్ బివి సుబ్బారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్ఐసిని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని అన్నారు. ఎఫ్‌డిఐని ఇన్సూరెన్సు రంగంలో వ్యతిరేకించాలని అన్నారు. ఎల్ఐసిలో కాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలని అన్నారు. ఎల్ఐసి, ప్రీమియంపైన జిఎస్టీ రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. జిల్లా సెక్రటరీ ఆర్‌విఎస్ రామిరెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇతర కార్మిక సంఘాలను కలుపుకుంటూ యూనియన్ ఇచ్చే పిలుపులను విజయవంతం చేస్తా మని అన్నారు. జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మె లో భీమా ఉద్యోగులు పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశానికి వచ్చిన ఒంగోలు, అద్దంకి బ్రాంచి నాయ కులకు, సిఐటియు నాయకులకు అభినందనలు తెలిపారు.

ఎల్ఐసి యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

- రూ.3.15 కోట్లు కేటాయింపు
- పెద్దగంజాం, చిన్నగంజాం ప్రజల హర్షం..
- దశాబ్దాల కల నెరవేర్చిన ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి - వేటపాలెం, చినగంజాం

చిన్నగంజాం, పెద్దగంజాం ప్రజల కల నెరవేర్చిన పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావుకు ఆ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని పెద్దగంజాం, రాజుబంగారుపాలెం, ఎన్టీఆర్ వారధి, పెద్దగంజాం, కొత్తగొల్లపాలెం రోడ్డు నిర్మాణానికి రూ.3.15 కోట్లు మంజూరు చేయడంపట్ల ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పించి నిధులు మంజూరు చేయించిన ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావును ఆయా గ్రామల నేతలు అభినందించారు. ఈ సందర్భంగా పెద్దగంజాం, రాజు బంగారు పాలెం గ్రామాల మధ్య ఎన్టీఆర్ వారధి వరకు బైక్ ర్యాలీ శనివారం నిర్వహించారు. వారిధిపై ఎమ్మెల్యే ఏలూరి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సరైన రహదారి, బ్రిడ్జిలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఎమ్మెల్యే ఏలూరి కృషితో ఎన్టీఆర్ వారిది నిర్మాణం చేపట్టారని అన్నారు. గత ఐదేళ్లలో రోడ్డు పట్టించుకున్న నాధుడే లేడని అన్నారు. గుంటల రోడ్లలో ప్రయాణం నరకం చూశామని పేర్కొన్నారు. దశాబ్దాల నాటి కష్టాలకు ప్రస్తుతం రోడ్డు నిర్మాణంతో ఉపశమనం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు ఆసోది బ్రహ్మారెడ్డి, తెలుగు రైతు నియోజకవర్గ ఉపాధ్యక్షులు కోకి ఉదయ భాస్కరరెడ్డి, పెద్దగంజం సర్పంచ్ నక్కల కృష్ణ, తెలుగుదేశం బీసీ సెల్ సీనియర్ నాయకులు వాటుపల్లి ఏడుకొండలు, మున్నవారిపాలెం ఎంపీటీసీ మున్నం నాగాంజ, కొత్తపాలెం ఎంపీటీసీ రాంబాబురెడ్డి, భోగిరెడ్డి కోటిరెడ్డి, ఆసోది వెంకట అంజిరెడ్డి, కొక్కిలిగడ్డ విష్ణు, మాచవరపు రాజేష్, కోడూరి శ్రీనివాసులు, గడ్డం కోటయ్య పాల్గొన్నారు.

ఏలూరు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పెన్షన్ అంద జేస్తున్న కలెక్టర్ వెంకట మురళి

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పట్టణంలోని చిల్లర గొల్లపాలెంలో కలెక్టర్ జె వెంకటమురళి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లు శనివారం పంపిణీ చేశారు. బోయినోళ్ల నాగ శేషమ్మ అనే వద్ధురాలుతో పాటు పలువురికి అందజేశారు.

పెన్షన్ అంద జేస్తున్న ఎంఎల్ఎ నరేంద్రవర్మ

బాపట్ల : అర్హులైన నిరుపేదలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ మరింత ఆసరా కల్పిస్తుందని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. స్థానిక 24వ వార్డు ఇమ్మడిశెట్టి వారిపాలెంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, కుట్టుబోయిన రమేష్ పాల్గొన్నారు.

పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : జూన్ 1న ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే 31నే పెన్షన్ ఇచ్చే ఆలోచన ఎంతో గర్వంగా చెప్పుకునే విషయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. పట్టణంలోని 27వ వార్డు నందు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. ఒకరోజు ముందుగానే పెన్షన్ అందిస్తున్న మంచి ప్రభుత్వమని లబ్దిదారులు అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రషీద్, అదికారులు, కౌన్సిలర్లు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేటపాలెం : ముందస్తు పెన్షన్ పంపిణీని గర్వంగా చెప్పుకుంటామని శాసన సభ్యులు మద్దూరి మాలకొండయ్య అన్నారు. దేశాయిపేట, వేటపాలెం పంచాయతీల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1న ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగా 31నే పెన్షన్ ఇచ్చే ఆలోచన ఎంతో గొప్పగా ఉందని అన్నారు. లబ్దిదారులూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎంపిడిఓ పిటివి కృష్ణ

యద్దనపూడి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు 93శాతం పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ పిటివి కృష్ణ తెలిపారు. 1న ఆదివారం కావడంతో ముందురోజే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మిగిలినవి జూన్ 3వరకు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ భారతి, కార్యదర్శులు శరత్, శ్రీను, మోహన్ బాబు, రాణి, ప్రభాకర్, తేజ, నాగేష్, అశోక్, మహిళా పోలీస్ స్వాతి, వాసు పాల్గొన్నారు.

చిన్నారులకు సైన్స్ ట్రిక్స్ నేర్పుతున్న మెజీషియన్ రామన్

ఉగ్రవాదాన్ని, మత విద్వేషాలను నిలువరించి..

మత సామరస్యాన్ని కాపాడుకుందాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-కొండపి

ఉగ్రవాదాన్ని, మత విద్వేషాలను నిలువరించి మతసామరస్యాన్ని కాపాడు కుందామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు తెలిపారు. పెరిదేపిలోని ఎంఎస్ విజ్ఞాన కేంద్రంలో పహల్గామ్ ఉగ్రదాడులు – అనంతర పరిణామాలు అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పహల్గామ్ ప్రాంతంలో గత నెల 22న ఉగ్రవాదులు టూరిస్టులపై కాల్పులు జరిపి 26 మంది ప్రాణాలను బలిగొన్న అమానుషమని తెలిపారు. ఈ హత్యాకాండను తీవ్రంగా ఖండించారు. ఈ దారుణానికి పాల్పడిన ఉగ్రవాదులను నేటికీ ప్రభుత్వం పట్టుకోక పోవడం విచారకరమన్నారు. ఉగ్రవాదులు జరిపిన దాడిని ఆసరా చేసుకుని బిజెపి ఆర్ఎస్ఎస్, మతోన్మాద శక్తులు ముస్లింలు హిందువుల మీద చేసిన దాడిగా ప్రచారం చేస్తూ ప్రజల మధ్య కల్లోలం సృష్టించే కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పటి వరకూ దేశ ప్రధాని హత్యాకాండలో మతి చెందిన బాధిత

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కుటుంబాలను పరామర్శించ లేదన్నారు. స్మార్ట్ ఫోన్లు తయారుచేసే యాపిల్ కంపెనీని ఇండియాకు రాకుండా అడ్డుకోవడం, భారత విద్యార్థులకు వీసాలు నిలుపుదల చేయటం, ఇండియాకు డబ్బులు పంపే ఎన్ఆర్ఐలపై పన్నులు వేసే చర్యలకు పాల్పడుతున్న అనేక ట్రంప్ వ్యవహార తీరుపట్ల భారత ప్రభుత్వం లొంగుబాటు ఆందోళనకరమన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కే.జీ.మస్తాన్ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతుంటే మోడీ ప్రభుత్వానికి పట్టలేదని అన్నారు. 4 లక్షలకు పైగా సైన్యంలో ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేయలేదన్నారు. దేశ సరిహద్దుల్లో సెక్యూరిటీ లేదని, ఫలితంగానే దేశంలోకి ఉగ్రవాదులు చొరబడుతున్నారని తెలిపారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ఉన్న ఉద్యోగులను తీసేస్తున్నారని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, మండల కమిటీ సభ్యులు ముప్పరాజు బ్రహ్మయ్య, ఎం. చిన్న పేతురు, సీనియర్ నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, పుట్టా రామారావు, తొట్టెంపూడి శేషారావు, గుమ్మళ్ళ లక్ష్మీనారాయణ, కామనీ బ్రహ్మయ్య, మల్లెల పెద్ద పేతురు, ఎల్ దావీదు, ఎం సంపూర్ణ, ఎల్ సుధాకర్, జాంబులు, జక్కరయ్య, జాన్, ప్రభాకర్, స్వరూప పాల్గొన్నారు

సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి స్వామి

సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి వరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో జరుగుమల్లి మండలం లోని పాలేటిపాడు గ్రామానికి చెందిన లామ్ జాలమ్మ కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.44,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి యోహాను, టిడిపి పాలేటిపాడు గ్రామ అధ్యక్షుడు మక్కెన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ప్రారంభం రోజునే..

విద్యార్థి మిత్ర కిట్లు అందజేయాలి

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పాఠశాలల ప్రారంభం రోజునే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేయాలని అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ ఆదేశించారు. స్థానిక డిఆర్ఆర్ఎం పాఠశాలలో ఎంఈఒలు,సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభం రోజునే ప్రతి విద్యార్థికి ఎస్ఆర్కెవిఎం కిట్లు తప్పనిసరిగా అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకిట్ల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి సరైన కొలతలు తీసుకుని యూనిఫాం,బూట్లు అందించాలని సూచించారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకూ మూడు జతల యూనిఫాం క్లాత్ (బాలికలకు చున్నీలతో సహా) స్కూల్ బ్యాగ్, బెల్టు, జత బూట్లు, రెండు జతల సాక్స్, పాఠ్యపుస్తకాలు, అవసరమైన నోట్ పుస్తకాలు, ఒకటో తరగతి విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీ, ఆరో తరగతి విద్యార్థులకు ఆక్సఫర్డ్ డిక్షనరీ అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. కిరణ్ కుమార్ సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, జిల్లాలోని ఎంఇఒలు,డిఇఒ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు

ప్రజాశక్తి -చీమకుర్తి

జులై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పంగులూరి కష్టయ్య భవనం సెంటర్లో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970 మే 30న సిఐటియు ఏర్పడినట్లు తెలిపారు. అప్పటి నుంచి కార్మిక వర్గాన్ని ఐక్యం చేస్తూ దోపిడీ లేని రాజ్యం కోసం సిఐటియు శ్రమిస్తుందన్నారు. కార్మిక, కర్షక ఐక్యత కోసం కృషి చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులుగా మార్చారన్నారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. మరింత దోపిడీకి అవకాశం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని, నేటి యువత ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.కార్మికుల హక్కుల కోసం రాబోయే రోజుల్లో ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు, సిఐటియు మండల కార్యదర్శి పల్లపల్లి ఆంజనేయులు, జిల్లా నాయకులు పూసపాటి వెంకట్రావు, సిఐటియు మండల నాయకులు పాడిబండ్ల పద్మ, దాసరి సురేష్, కనకరాజు, పుల్లయ్య, వాలేశ్వరరావు, శంకరు, నరసయ్య, శ్రీను, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న కాలం సుబ్బారావు

హనుమంతరావు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

గ్రామీణ ప్రాంతాల్లో నోరు లేని జీవాలకు హనుమంతరావు అందించిన సేవలు ప్రశంస నీయమని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ పోతుల హనుమంతరావు ఉద్యోగ విరమణ సభ నాగులుప్పలపాడు మండలం చదలవాడ లోని కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బసవ శంకరం అధ్యక్షతన నిర్వహించిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ హనుమంతరావు తన సర్వీస్ కాలంలో వేలాది మూగ జీవాలకు సేవలందించి ఎంతో మంది రైతులు, పశు వైద్యాధికారుల మన్ననలు పొందడం అభినందనీయమని తెలిపారు. పనిపట్ల హనుమంతరావు కనపరిచిన శ్రద్ధ, వత్తిలో ఆయన నిబద్ధత, అంకితభావం, అధికారులపట్ల విధేయత, రైతుల పట్ల ఆయన చూపిన అభిమానాలు అందరికీ ఆదర్శమని కొనియాడారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ ఎ. రమేష్, పశు క్షేత్రం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె. రవి, అసిస్టెంట్ డైరెక్టర్ నాగభూషణం, మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వి. రవీంద్ర నాథ్ ఠాగూర్, ఎడీ వెంకటరామిరెడ్డి, డాక్టర్ అనురాధ , ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటరినేరియన్ ఫెడరేషన్ చైర్మన్ రమేష్ బాబు మాట్లాడారు.ఈ సందర్భంగా హనుమంతరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెటరినేరియన్ ఫెడరేషన్ సెక్రటరీ కోటేశ్వరరావు ట్రెజరర్ ప్రభావతి, ప్రెసిడెంట్ సుశీల, వెంకటరావు, శ్రీనివారావు, కె. శంకరరావు, ఉప సర్పంచ్ కోడె వెంకట సుబ్బారావు, పశు వైద్యాధికారులు, పేరావెట్స్, పశు సంవర్ధక శాఖ సిబ్బంది , రైతులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

హనుమంతరాలు దంపతులకు సన్మానిస్తున్న అధికారులు, రైతులు

మ్యాజిక్‌తో సైన్సు అభివృద్ధి

మెజీషియన్ బి.రామన్

ప్రజాశక్తి-దర్శి

మ్యాజిక్ ద్వారా సైన్స్‌ను అభివృద్ధి చేయవచ్చునని ప్రముఖ మెజీషియన్ బి.రామన్ తెలిపారు. దర్శి సుందరయ్య భవనం నిర్వహిస్తున్న రెండో బాలోత్సవ శిక్షణ తరగతులను శనివారం రామన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలు, మతం, కులం, వ్యక్తిగత ప్రయోజనాలు పెరిగిపోతున్నట్లు తెలిపారు. దేశభక్తి, ప్రజలంతా కలిసి, మెలిసి ఉండటం, ఉమ్మడి ప్రయోజనాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా చిల్డ్రన్ క్లబ్ బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినోదం, వికాసం, కలసి మెలసి జీవించడం, విజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండుతున్న కర్పూరం నోట్లో వేసుకోవడం, తాడుతో విన్యాసాలు, గణిత విన్యాసాలు తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పాటలపై ఉప్పు మోహనరావు శిక్షణ ఇచ్చారు. బాలోత్సవానికి సమన్వయ కర్తలుగా కెవి.పిచ్చయ్య, ఈమని నాగేశ్వరరావు,చిట్లా ఆదినారాయణ వ్యవహరించారు.

చిన్నారి గీతికకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-మద్దిపాడు : మండల పరిధిలోని దొడ్డవరప్పాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ముళ్ళూరి మురళి అన్న హరిప్రసాద్, వదిన మాధవీ లత కుమార్తె గీతిక ఓణీల వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో టిడిపి అధ్యక్షుడు మండవ జయంత్ బాబు పాల్గొని చిన్నారి గీతికను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామలింగయ్య, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, రెబ్బవరపు ప్రభాకర్, పారా నరసింహారావు, మండవ గోపి చంద్ , సుద్దపల్లి అనిల్ , నవులూరి శివకృష్ణ ,వేల్పుల నాగరాజు, చింతల శ్రీను , చెరుకూరి శ్రీను, మండవ శివానందరావు ,దొప్పా శేషయ్య ,నైనాల భావన్నారాయణ ,మండవ కోటేశ్వర రావు ,మారెళ్ళ హరికుమార్ పాల్గొన్నారు.

సిసిఆర్ కార్డుల జారీపై అవగాహన

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలానికి 1,002 సిసిఆర్‌సి కార్డులు లక్ష్యంగా నిర్దేశించినట్లు వ్యవసాయశాఖ అధికారి డి. యుగంధరరెడ్డి తెలిపారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డుల జారీపై రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందికి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ ఫలాలు అన్నదాత సుఖీభవ, పంటల బీమా పొందాలంటే తప్పనిసరిగా గుర్తింపు కార్డు అవసరమని తెలిపారు. పొలం కౌలు తీసుకొని పంటలు సాగు చేసే ప్రతి రైతులు గుర్తింపు కార్డు కోసం నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్కు ఆధునీకరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్ : స్థానిక 37వ డివిజన్ ఎన్టిఆర్ పార్కులో రూ.35 లక్షల వ్యయంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఆధునీకరణ పనులను మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శనివారం పరిశీలించారు. పనుల పురోగతిపై సమీక్షించారు. కాంట్రాక్టర్కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ ,కమిషనర్ మాట్లాడుతూ సర్వాంగ సుందరంగా , అన్ని రకాల వసతులతో, ఆహ్లాదకరంగా ఎన్టిఆర్ పార్కును ఆధునీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికకార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి ఎస్‌పిడి వెన్నెల

ఉచిత న్యాయవిజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - రేపల్లె

న్యాయస్థానానికి ప్రజలకు వారిదిగా పిఎల్‌విలు పనిచేస్తూ గ్రామాల్లో న్యాయ విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో ఉచిత న్యాయ విజ్ఞానం పట్ల అవగాహన కల్పించాలని జడ్జి ఎస్‌పిడి వెన్నెల అన్నారు. స్థానిక న్యాయ స్థానం హాలులో పారా లీగల్ వాలంటీర్లు, ప్యానల్ లీగల్ న్యాయవాదులకు జాతీయ లోక్ అదాలత్, ఉచిత న్యాయ విజ్ఞాన శిబిరాల నిర్వహణ, వాటి వలన ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో పిఎల్‌విల పేర్లు, వారి మొబైల్ నెంబర్లతో సమాచార కేంద్రం వద్ద ప్రతి గ్రామంలో ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. జూలై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి దేవి సాయి శ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గీతా భార్గవి, ప్యానల్ అడ్వకేట్లు కె శ్రీవాణి, జి కుమార్ బాబు, పారా లీగల్ వాలంటీర్లు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావు, ఆలా మోషే, ఎం నాగమల్లేశ్వరరావు, సయ్యద్ తాహిర్ అహ్మద్ పాల్గొన్నారు.

పైపులైన్ లీకుతో తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మరమ్మతులు చేస్తున్న కూలీలు

గ్రామంలోని తహశీల్దారు కార్యాలయం ఎదురుగా ఆంజనేయస్వామి గుడి వెనుక ప్రధాన పైపు లైన్ లీకైంది. దీంతో శనివారం సాయంత్రం, ఆదివారం ఉదయం అద్దేపల్లి వాటర్ ట్యాంకు, మార్కెట్ దగ్గర ఉన్న వాటర్ ట్యాంక్, పెదమాలపల్లి వాటర్ ట్యాంకుల ద్వారా ఆయా ఏరియాలకు వచ్చే నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని సర్పంచ్ ద్వారా రవి కిరణ్మయి తెలిపారు. ప్రధాన పైపులైన్ లీకేజి వర్క్స్, కాంక్రీట్ వర్క్స్ శనివారం సాయంత్రం పనులు పూర్తయ్యాయని, మిగిలిన మరమత్తు పనులు పూర్తి చేసి ఆదివారం సాయంత్రం నీటి సరఫరా చేయగలమని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

డాక్టర్ శ్రీనివాసరావు మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

శ్రీనివాసరావు (ఫైల్)

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులుగా పనిచేస్తున్న ఎ శ్రీనివాసరావు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన గత కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యశాల సిబ్బంది తెలిపారు. ఆయన మృతి పట్ల భట్టిప్రోలు, వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృత దేహానికి నగరం మండలం తాటాకువారిపాలెంలో ఆదివారం అంత్యక్రియలు జరుగుతాయని సిబ్బంది చెప్పారు.

మండల స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

జూన్ 2, 3తేదీల్లో మండల స్థాయి యోగ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 7నుండి జూనియర్స్‌కు, యువతకు, సీనియర్ విభాగంలో స్త్రీ, పురుషలకు వేరు వేరుగా పోటీలు జరుగుతాయని తెలిపారు. గెలిచిన వారిని 9నుండి జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

2వ తేదీకి సప్లిమెంటరీ మూల్యాంకనం పూర్తి

ప్రజాశక్తి - బాపట్ల

ఎంఈఓ దేవరకొండ ప్రసాద్

పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష పత్రాల మూల్యాంకనం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాల్లో జూన్ 1, 2 తేదీల్లో పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఎంఈఓ2 డి ప్రసాదరావు తెలిపారు. దీనికి సంబంధించి విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి మూల్యాంకనం ప్రారంభించినట్లు తెలిపారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో ఒక్కో పేపర్ ముగ్గురు ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తారని తెలిపారు. సహాయ ఎగ్జామినర్ జవాబు పత్రాలు మూల్యాంకనం చేసిన తర్వాత మార్కుల లెక్కింపు, పరిశీలన చేస్తారని తెలిపారు. కేంద్రానికి చీఫ్ ఎగ్జామినర్‌గా ఉండే సీనియర్ స్కూల్ అసిస్టెంట్ లేదా హెచ్ఎం పరిశీలిస్తారని తెలిపారు. ఒక్కో జవాబు పత్రంపై ఈ ముగ్గురూ సంతకాలు చేస్తారని తెలిపారు. ఏడు సబ్జెక్టులకు సంబంధించి జిల్లాలో 25 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాములను ఎంపిక చేసినట్లు తెలిపారు. తెలుగుకు ఐదుగురు, ఇంగ్లీషుకు ఐదుగురు, సైన్సుకు కలిపి 30 మంది, సోషల్‌కు 42 మంది మూల్యాంకనం చేస్తారని తెలిపారు. హిందీ ఒక్క ఉపాధ్యాయుడే పేపర్లు దిద్దాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతిరోజు ఒక్కరు 40 పేపర్లు మాత్రమే దిద్దాల్సి ఉంటుందని తెలిపారు. 12,756 పేపర్ల స్పాట్ వాల్యుయేషన్ జూన్ 2లోగా పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎమ్మెల్యే ఏలూరి
- 16 పనులకు రూ.1.13కోట్ల నిధులు మంజూరు
- మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయింపు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సిన తిమ్మిడితిపాడు పాఠశాల

గ్రామీణ విద్య ఉన్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కృషి చేస్తున్నట్లు తెలిపారు. సర్వ శిక్ష అభియాన్ పథకం కింద నియోజకవర్గానికి రూ.1,13,85,000 నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. పాఠశాలల అభ్యున్నతి, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల రక్షణకు ప్రహరీ గోడల నిర్మాణం, విద్యార్థినీ, విద్యార్థులకు వేరు వేరుగా ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణం, వివిధ పాఠశాలల్లో భవనాల మరమ్మత్తులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. మంజూరైన పనులు నియోజకవర్గంలోని పాఠశాలల్లో ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, తరగతి గదుల మరమ్మత్తుల వంటి 16 పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికి రూ.56.25లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వాటిలో పర్చూరు ప్రాథమిక పాఠశాలకు రూ.9.37లక్షలు, దగ్గుబాడు ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు రూ.9.37లక్షలు, గర్నెపూడి ప్రాథమిక పాఠశాలకు రూ.9.37లక్షలు, కొడవల వారి పాలెం ప్రాథమిక పాఠశాలకు రూ.9.37లక్షలు, వీరన్నపాలెం పాఠశాలకు రూ.9.37లక్షలు, పర్చూరు పాఠశాలకు రూ.9.37లక్షలు విడుదల చేశారని తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.26.60లక్షలు విడుదల కాగా వీటిలో తీమిడితపాడు బాలుర పాఠశాల మరుగుదొడ్లకు రూ.3.80లక్షలు, దగ్గుబాడు ఏబీ నగర్ ప్రాథమిక బాలుర పాఠశాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3.80లక్షలు, పర్చూరు ప్రాథమిక బాలుర పాఠశాలకు రూ.3.80లక్షలు, దగ్గుబాడు ఏబీ నగర్ బాలికల పాఠశాలకు రూ.3.80లక్షలు, గర్నపూడి బాలికల పాఠశాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3.80లక్షలు, అడుసుమల్లి అంజయ్య బాలికల ప్రాథమిక పాఠశాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3.80లక్షలు, బోడవాడ బాలికల ప్రాథమిక పాఠశాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3.80లక్షలు కేటాయించారు. పాఠశాలల మరమ్మత్తులకు రూ.18లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్ల తెలిపారు. వీటిలో దగ్గుబాడు ఏబీనగర్ ప్రాథమిక పాఠశాల మరమత్తులకు రూ.6లక్షలు, దగ్గుబాడు ఉర్దూ పాఠశాల మరమత్తులకు రూ.6లక్షలు, పర్చూరు పాఠశాల మరమత్తులకు రూ.6లక్షలు కేటాయించినట్లు తెలిపారు. మోటుపల్లి పాఠశాల భవన నిర్మాణానికి రూ.13లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు.

దేవాదాయ భూములకు కౌలు వేలం

ప్రజాశక్తి - పంగులూరు

మండల కేంద్రమైన పంగులూరులోని రెండు దేవాలయాలకు చెందిన భూములకు అధికారులు కౌలు వేలం పాట శనివారం నిర్వహించారు. స్థానిక భీమలింగేశ్వర స్వామి దేవాలయానికి చెందిన 46 ఎకరాల భూమికి కౌలు వేలం పాట నిర్వహించగా రూ.6,96,000కు రైతులు దక్కించుకున్నరు. ఈ భూమిని గతంలో రూ.11,21,000లకు పాడుకున్నారని, రూ.4.25లక్షలు తగ్గిందని పంగులూరు గ్రూపు దేవాలయాల ఇఒ యు శ్రీనివాసరావు తెలిపారు. వీరేశ్వర స్వామి దేవాలయానికి చెందిన 10 ఎకరాల భూమిని వేలంపాట నిర్వహించగా రూ.1,66,000లకు రైతులు పాడుకున్నారని, ఈ భూములకు గతంలో రూ.3,28,000లకు రైతులు పాడుకున్నారని, ఇప్పుడు రూ.1.62లక్షలు తగ్గిందని తెలిపారు. గతం కంటే ఈసారి కౌలు వేలంలో రూ.5.87లక్షలు తగ్గిందని చెప్పారు. గతంలో ఈ భూములను పాడుకున్న రైతులు కౌలు ఎక్కువైందని, పరిస్థితులు బాగా లేవని భూములు వెనక్కు ఇవ్వటంతో అధికారులు రెండు సార్లు కౌలు వేలం పాట నిర్వహించారు. అప్పుడు కూడా రైతులు ముందుకు రాకపోవడంతో శనివారం 3వ సారి పాటలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అద్దంకి పరిశీలకులు ఎం వెంకటేశ్వరరావు, మెదరమెట్ల ఈఓ జి వాసు బాబు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య కల్యాణం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని రామన్నపేటలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య ఆధ్యాత్మిక కళ్యాణ వేడుక శనివారం ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. కళ్యాణంలో గుంటూరు విష్ణుకుమార్, శివపార్వతి దంపతులు కర్తలుగా వ్యవహరించారు. కళ్యాణ అనంతరం అన్న సంతర్పణ దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. అమ్మవారి స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు చేశారు. మహిళలు కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. బులసల రామలింగం, లక్ష్మీప్రసాదరావు, వేటపాలెం జడ్పిటిసి బండ్ల తిరుమల దేవి, బండ్ల బాబు, బండ్ల శ్రీనివాసరావు, యారాసు అరుణ్ బాబు, నాసిక జగన్, గుమ్మడి సుశీల, మాజీ ఎంపీటీసీ పిచ్చుక సునీత, కుమారస్వామి పాల్గొన్నారు.

డాక్టర్ గణేష్‌ను సత్కరిస్తున్న అభిమానులు

వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

వైసిపి ఇన్చార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గుల్లపల్లిలోని డాక్టర్ ఈవూరి సుబ్బారావు మెమోరియల్ ఆసుపత్రి వద్దగల క్యాంపు కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేకులు కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు యార్లగడ్డ మదన్మోహన్, చిత్రాల ఓబేదు, చిమట బాలాజీ, కరేటి శేషగిరిరావు, దుండి వెంకట రామిరెడ్డి, వేసం నాగలక్ష్మి, కాశీ ప్రభాకరరావు, నిజాంపట్నం కోటేశ్వరరావు, రాంబాబు, ఉల్లంగుంట శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న మేరుగు నాగార్జున

వైసిపి గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల

అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్న కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 4న వైసిపి నిర్వహించే వెన్నుపోటు దినోత్సవ గోడపత్రికను మాజీ మంత్రి మెరుగు నాగార్జున స్థానిక వైసిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. తాము అధికారంలో ఉండగా సంక్షేమ పథకాలు అమలు చేశామని అన్నారు. తమకన్నా ఎక్కువ సంక్షేమం అమలు చేస్తామని హామీలు ఇచ్చి అధికారానికి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదని అన్నారు. కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, సముద్రాలు గౌడ్, జోగి రాజా, నక్క వీరారెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య, గవిని కృష్ణమూర్తి, సుధీర్ బాబు పాల్గొన్నారు.

మండప నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి బల్లికురవ మండలం బి కొప్పెరపాడు గ్రామానికి చెందిన కామినేని వెంకట్రావు, సుచరిత దంపతులు రూ.1,00,116, దేవస్థానం సమీపంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన కళ్యాణ మండపం ఆధునికరణ పనులు నిమిత్తం ప్రకాశం జిల్లా ముండ్లమూరు గ్రామానికి చెందిన మేదరమెట్ల శేషగిరిరావు, సౌజన్య దంపతులు ఎసి, గ్రీజర్, మంచం, బెడ్డు ఇతర వస్తువులు కొనుగోలు చేయడానికి అవసరమైన నగదును సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మదమంచి తిమ్మనాయుడుకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం కార్యదర్శిగా జయ భరతరెడ్డి

ప్రజాశక్తి - కర్లపాలెం

వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మండలానికి చెందిన దొంతి బోయిన జయభారతరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించినట్లు వైసిపి ఇన్‌ఛార్జి, మాజీ ఉపసభాపతి కోన రఘుపతి శనివారం తెలిపారు. వైసిపి యువజన భాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాపట్ల మండలానికి చెందిన నక్క వీరారెడ్డిని నియమిస్తూ అధినేత జగన్మోహనరెడ్డి ప్రకటించినట్లు పేర్కొన్నారు.

మా భూములకు హక్కులు కల్పించండి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత 20 నుండి 30 ఏళ్ల క్రితం తనకున్న భూములను అమ్ముకొని తిరిగి ఇప్పుడు వచ్చి తమ భూములకు హక్కులు కల్పించాలని ఓ నకిలీ రైతు అధికారులను ఒత్తిడికి గురిచేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఐలవరంకు చెందిన ఒకప్పటి భూ స్వామి అత్తలూరి గోపాలరావు 40 ఏళ్ల క్రితం తనకున్న వందల ఎకరాల భూమిని కుమారులు, కుమార్తెలకు బాగ పంపిణీ చేసి వీలునామా రాశాడు. ఆ వీలునామా సందర్భంగా కొడుకులు, కూతుళ్లు పొలాలను విక్రయించుకొని గ్రామం వదిలి పట్టణాల్లో వ్యాపారాలు ఉద్యోగాలుకై వెళ్లిపోయారు. వీరిలో ఒక కుమారుడు అత్తలూరు మనోహరరావు తన వాటా క్రింద వచ్చిన 22 ఎకరాల భూమిని గతంలో ఎప్పుడో అమ్మేసుకుని తిరిగి మరల గత కొన్నేళ్లుగా తన భూములు ఆక్రమణకు గురయ్యాయని వాటిని పరిశీలించి తన పేరున ఎక్కించాలంటూ తన కుమారులతో కలిసి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. దీంతో తహశీల్దారు మేక శ్రీనివాసరావు మనోహరరావు ఇచ్చిన దరఖాస్తుపై గ్రామంలో 20మంది రైతులకు నోటీసులు జారీ చేశారు. ఈ భూములు మనోహరరావుకు చెందిన భూములు ఆక్రమణకు గురయ్యాయని దరఖాస్తు చేసిన దృష్ట్యా రైతులందరూ తాము కొనుగోలు చేసుకున్నా భూములకు చెందిన దస్తావేజులను తీసుకొని మే 31న తహశీల్దారు కార్యాలయానికి రావాలని నోటీసులు జారీ చేశారు. దీంతో 31న పది మంది రైతులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను తీసుకుని తహశీల్దారు కార్యాలయానికి వచ్చి పరిశీలించారు. ఈ పరిశీలనలో దస్తావేజులు స్వయంగా మనోహరరావు విక్రయించి సంతకాలతో

తహశీల్దారుకు తమ దస్తావేజులు చూపుతున్న రైతులు

రిజిస్ట్రేషన్ చేయించినట్లు స్పష్టమైనదని తెలిపారు. మిగిలిన పదిమంది కూడా తమ వద్ద ఉన్న దస్తావేజులను తీసుకొని తహశీల్దారు కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని సూచించారు. గత 20ఏళ్ల క్రితం భూములను స్వయంగా అమ్ముకొని వెళ్లిపోయిన మనోహరరావు ఇప్పుడు వచ్చి తమ భూములని, తాను ఏ ఒక్కరికి అమ్మ లేదని రైతులు చూపిస్తున్న డాక్యుమెంట్లు నకిలీవని, దానిలోని సంతకాలు ఫోర్జరీ చేశారని మనోహరరావు ఆరోపించారు. ఇప్పటికే మనోహరరావు వద్ద కొనుగోలు చేసిన రైతులు మరో ముగ్గురికి అమ్మకాలు జరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో తానే స్వయంగా అమ్ముకొని ఇప్పుడు వచ్చి ఈ భూములు తమవేనని చెప్పటం ఎంత వరకు సమంజసమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం జరిగిన దస్తావేజుల పరిశీలనలో మనోహరరావే స్వయంగా విక్రయించినట్లుగా నిర్ధారించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అయినప్పటికీ ఇవి తన సంతకాలు కాదు, ఫోర్జరీ జరిగిందని మనోహరావు తన కుమారులతో కలిసి తహశీల్దారుతో వాగ్వివాదానికి దిగారు. దీంతో డాక్యుమెంట్లు, సంతకాలు ఫోరెన్సిక్ నిపుణుల ద్వారా పరిశీలన చేయించుకోండని చెప్పినట్లు తెలిసింది.

అమ్మిన భూములు తనవనడం విడ్డూరం

తాను స్వయంగా మనోహరరావుకు డబ్బులు ఇచ్చి అతని వద్ద నుండి 2.30ఎకరాల భూమి కొనుగోలు చేసుకుని 25ఏళ్ల క్రితం రిజిస్టర్ చేయించుకున్నట్లు, ఇప్పుడు వచ్చి ఆ సంతకాలు తమవి కావు, దొంగ డాక్యు మెంట్లు పుట్టించారని చెప్పటం సరైనది కాదని గ్రామానికి చెందిన దుంతు బాలకృష్ణ వాపోయాడు. మనోహరరావు చేస్తున్న ఆకృత్యాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

తండ్రి వారసత్వంగా వచ్చింది

అలాగే 1994లో అత్తలూరి మనోహరరావు నుండి ఆకురాతి కోటేశ్వరరావు కొనుగోలు చేసుకున్న భూమి వారసత్వంగా తమ తండ్రి నుండి తనకు సంక్రమించిందని, ఇప్పుడు వచ్చి ఆ భూమి తనదని, తాను విక్రయించలేదని మనోహరరావు చెప్పటం విడ్డూరంగా ఉందని గ్రామానికి చెందిన యువరైతు ఆకురాతి నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడో అమ్ముకున్న భూములకు ఇప్పుడు వచ్చి తనవే అనటం మనోహరరావుకు మతిస్థిమితం కోల్పోయినట్లుగా ఉందని ఆరోపించాడు. ఈ విషయంపై తహశీల్దారు మేక శ్రీనివాసరావు మాట్లాడుతూ ముందుగా మనోహరరావు తన తండ్రి నుండి బాగ పంపిణీ ద్వారా వచ్చిన వీలునామా దస్తావేజుల ఆధారంగా ఆయన కోరిన విధంగా రైతులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. రైతులు కొనుగోలు చేసిన దస్తావేజులు పరిశీలించగా మనోహరరావే స్వయంగా విక్రయించినట్లు నిర్ధారణ అయిందని అన్నారు. మిగిలిన రైతులు కూడా వారి వద్ద ఉన్న దస్తావేజులు తీసుకువచ్చి పరిశీలించుకోవాలని సూచించారు.

యోగాతో మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు యోగ సాధన చేయాలని ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో యోగా తరగతులు ప్రారంభించారు. ఇన్చార్జి డిఎల్పిఓ కెజిఎ శ్రీనివాసన్, కార్యదర్శులు ఈవూరి విజయబాబు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

రేపల్లె : యోగాసనాల ద్వారా ఆరోగ్యవంత మైన జీవితాన్ని గడపవచ్చని ఎంపిడిఓ ఎం శోభారాణి పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన యోగా శిక్షణా తరగతుల్లో ఆమె మాట్లాడారు.

వేటపాలెం : మండలంలోని పందిళ్ళపల్లి హైస్కూల్ నందు యోగ శిక్షణ శనివారం నిర్వహించారు. పందిళ్ళపల్లి, చల్లారెడ్డిపాలెం, పుల్లరిపాలెం సచివాలయాల సిబ్బందితో యోగా తరగతులు నిర్వహించారు. శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు టి మాల్యాద్రిరావు, చల్లారెడ్డిపాలెం కార్యదర్శి వి రామ్మోహనరావు, పందిళ్ళపల్లి డాక్టర్ జయ కుమార్, పందిళ్లపల్లి ఎంహెచ్పి సిబ్బంది పాల్గొన్నారు.

కంటైనర్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన దృశ్యం

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన కంటైనర్

ప్రజాశక్తి - అద్దంకి

నిర్లక్ష్యపు డ్రైవింగుతో కంటైనర్ పొగాకు చెక్కులు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ఘటనలో ట్రాక్టర్ ధ్వంసం కాగా పొగాకు చెక్కు బేళ్ళన్నీ చిందర, వందరగా రోడ్డుపై పడ్డాయి. శనివారం ఉదయం స్థానిక బంగ్లా రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. ముండ్లమూరు మండలం గంగన్న పాలెం గ్రామానికి చెందిన రైతు వెల్లంపల్లి పొగాకు బోర్డుకు పొగాకు బేళ్లను తరలించి కొనుగోలు చేయని పొగాకు బెళ్లను ఇంటికి తీసుకు వస్తున్న సమయంలో మేదరమెట్ల వైపు నుండి సింగకొండ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను బంగ్లా రోడ్డు వద్ద అతి వేగంగా వచ్చి కంటైనర్ ఢీకొనడంతో ట్రాక్టర్ నడుపుతున్న చోదకుడు కింద పడిపోయాడు. స్థానికుల సమాచారం పోలీసులు వెంటనే అప్రమత్తమై ట్రాఫిక్కు క్రమబద్ధీక రించారు. ట్రాక్టరును బయటికి తీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేషన్ షాపుల కాటాలు ఆన్‌లైన్‌తో అనుసంధానం

ప్రజాశక్తి - పంగులూరు

రేషన్ షాపుల్లో ఉపయోగించే మిషన్లు, కాటాలు ఆన్లైన్లో పొందు పరుస్తున్నట్లు బాపట్ల అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ పి లిల్లీ తెలిపారు. మండలంలోని 34 రేషన్ షాపుల కాటా మిషన్లను స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్దకు తెచ్చి ఆన్లైన్ చేసినట్లు తెలిపారు. ఈ మిషన్లు, కాటాలు ఆన్లైన్ చేయడం ద్వారా రేషన్ షాపుల్లో ఏమి జరుగుతుందనేది అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమయం వృధా కాకుండా వెంటనే సరుకు పంపిణీ అయ్యే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తహశీల్దారు పి సింగారావు మాట్లాడుతూ రేషన్ దుకాణాల మిషన్లు ఆన్లైన్ చేయడం ద్వారా ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా పనులు జరుగుతాయని

రేషన్ షాపుల మిషన్లు అనుసంధానం చేస్తున్న అధికారులు

తెలిపారు. సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులోకి ఉంటుందని తెలిపారు. ఏ సరుకు ఎంతకు అమ్ముతుంది, స్టాకు ఎంత ఉందనే వివరాలు తెలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక బొమ్మల సెంటర్లో సినీ నటుడు కృష్ణ 83వ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కృష్ణ, మహేష్ బాబు అభిమానులు బొమ్మల సెంటర్లో ఏర్పాటు చేసిన కృష్ణ చిత్ర పటానికి పూల మాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన జన్మదిన కేకును ఈఒపిఆర్డి కె సత్యనారాయణ చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. అభిమానులకు పంచిపెట్టారు. దీంతోపాటు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద పాయసం, మజ్జిగ, పేదలకు

కృష్ణ జన్మదిన కేకు కట్ చేస్తున్న అభిమానులు

గొడుగులు, చెప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న, తోకల కృష్ణమోహన్, కోట శ్రీనివాసరావు, టి శ్రీను, సుబ్బయ్య పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు పొందిన విద్యార్థినికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితం సాధించిన స్థానిక శాతవాహన హైస్కూలో చదువుకున్న ఉప్పుటూరు గ్రామానికి చెందిన ఎన్ హర్షిత 596 మార్కులతో జిల్లా మొదటి స్థానం, రాష్ట్ర 5వ ర్యాంకు సాధించిన సందర్భంగా రోటరీ క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు రూ.40వేలు ఆర్థిక చేయుత శనివారం అందించారు. స్థానిక బొమ్మల సెంటర్లో నగదు అందజేశారు. హర్షిత ఇంటర్మీడియట్ చదువుకోడానికి ఆర్థిక సహాయం ఈఓపిఆర్డి కె సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో

ఆర్థిక చేయూత అందజేస్తున్న ఈఓపిఆర్డి, వైస్ ఎంపీపీ

రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, పాబోలు వెంకటేశ్వర్లు, పంబి సదానందరెడ్డి, కాసా అశోక్ కుమార్, కోటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న మంత్రి స్వామి

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-టంగుటూరు

మండల కేంద్రమైన జరుగుమల్లిలో శ్రీప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాజీ మంత్రి, వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైసిపి జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి, డాక్టర్ మాదాసి వెంకయ్య, వైసిపి మండల అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసరావు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు దగ్గుమాటి బూసిరెడ్డితదితరులు పాల్గొన్నారు.

ఎం.నిడమాలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని ఎం.నిడమాలూరు గ్రామంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్ ఎన్‌టిఆర్ భరోసా ఫించన్లు లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి టంగుటూరు మండల అధ్యక్షుడు కాకుమాని శ్రీనివాస్, గ్రామ సెక్రటరీ సుబ్బాయమ్మ, ఇంజినీర్ అసిస్టెంట్ మనీషా పాల్గొన్నారు.

కోలలపూడిలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

సుబ్బాయమ్మ (90)

రోటరీ అవయవదాన కమిటీ అభ్యర్థన మేరకు మార్టూరు మండలం కోలలపూడిలో నేత్ర దానం చేశారు. గ్రామానికి చెందిన కందిమల్ల సుబ్బాయమ్మ (90) వృద్ధాప్యం రీత్యా అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు ఆమె కళ్ళ కార్నియాను దానం చేశారు. గుంటూరు పెదకాకాని శంకర్ నేత్రవైద్యశాల వైద్యులు వచ్చి కార్నియా సేకరించారు. కళ్ళ దానానికి సహకరించిన సుబ్బాయమ్మ కుటుంబ సభ్యులు అంజిబాబు, సరోజిని, పార్వతి, సుకన్యను ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు అభినందించారు. ఎస్ రామ్మోహనరావు, జె వెంకటేశ్వర్లు, రోటరీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ ఉన్నారు.

ఏల్చూరులో అన్నదానం

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరులో శనివారం దేశమ్మ తల్లి అమ్మవారి 3వ వార్షికోత్సవం వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామంలో భక్తులతో పండుగ వాతావరణం నెలకొన్నది. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భారీగా అన్నదానం నిర్వహించారు.

నేడు వైసిపి నియోజకవర్గ సమావేశం

ప్రజాశక్తి - ఇంకొల్లు

వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి స్వగ్రామమైన మండలంలోని పావులూరుకు వైసిపి జిల్లా అధ్యక్షులు మెరుగ నాగార్జున ఆదివారం రానున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. వివిధ స్థాయిల్లో ఉన్న వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

- ఆర్ఒ ప్లాంట్ నిర్మాణానికి కృషి
- సిపిడబ్ల్యు స్కీమ్ నిర్వహణపై శ్రద్ధ ఏదీ.?
- పర్యాటక కేంద్రంగా రామతీర్థం జలాశయం
- విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి
- ప్రశ్నల వర్షం కురిపించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక జడ్పీ సర్వసభ్య సమావేశంలో సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. ఆర్ఒ ప్లాంట్లను సక్రమంగా నిర్వహించాలని అధికారులను కోరారు. సిపిడబ్ల్యు పథకాల నిర్వహణ శ్రద్ధ ఏదీ అంటూ ప్రశ్నించారు. రామతీర్థం జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యాహక్కు చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలపై గళమెత్తారు.

32 ఆర్ఒ ప్లాంట్ల నిర్మాణానికి కృషి

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

సిపిఆర్ నిధులు, ఎంపి ల్యాడ్స్‌తో పశ్చిమ ప్రకాశంలో 32 ఆర్ఒ ప్లాంట్ల నిర్మాణానికి కృషి చేస్తా. రక్షిత మంచి నీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్లు సక్రమంగా పని చేసేలా పర్యవేక్షించాలి. అవసరమైతే వచ్చే రెండేళ్లలో 100 ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా ప్రయత్నిస్తా. రక్షిత మంచి నీటిని సరఫరా చేసే పైపు లైన్ల మరమ్మతులు/కొత్త వాటికి ఎంపి ల్యాడ్స్ నుంచి కోటి రూపాయలు ఇస్తా. ఇప్పటికే సచివాలయాలకు తాను ఇచ్చిన 15 ట్యాంకర్లను స్వాధీనం చేసుకుని వినియోగించుకోవాలి. రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ పనులను పూర్తి చేసే గడువును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 2028 వరకు పెంచారు. ఈ పనులను వేగవంతం చేయాలి. రైతుల వద్ద పొగాకు నిల్వలు భారీగా ఉండటంతో మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చూడాలి. కొత్త జడ్పీ సమావేశ మందిరం నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలి.

సిపిడబ్ల్యు పథకాలపై శ్రద్ధ ఏదీ.?

ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్

తన నియోజకవర్గంలో సిపిడబ్ల్యు పథకాల నిర్వహణపై మరింత దృష్టి పెట్టాలి. రామతీర్థం. గుండ్లకమ్మ కాలువలు బాగు చేయించాలి. సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి. జూన్ నెలాఖరుకు పూర్తి చేయకపోతే నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం ఉండదు.

అర్హులందరికీ పని కల్పించాలి

దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఉపాధి హామీలో జాబ్ కార్డులు కలిగి, అడిగిన వారందరికీ ఎలాంటి పక్షపాతం లేకుండా పని కల్పించాలి. నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన ఉద్యాన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి.

కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాలి

కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్యకు తోడు సాగర్ నీటిని పంపిణీ చేసే పైపు లైన్లు దెబ్బతినటంతో కొత్త పైపులైన్లు వేయాల్సిన అవసరం ఉంది. అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు అందేలా చూడాలి. హెచ్ఎంపాడు మండలంలో తక్కువ వర్షపాతం నమోదైనా కరువు మండలంగా ప్రకటించలేదు. కరువు మండలంగా ప్రకటించేందుకు పున్ణపరిశీలన చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలి. కనిగిరి డయాలసిస్ సెంటర్‌లో మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.

ఆర్ఆర్ ప్యాకేజీలో 320 పేర్చు చేర్చాలి

- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాస ప్యాకేజి జాబితాలో 320 మంది పేర్లు లేవు. వాటిని పరిశీలించి చేర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. లేకపోతే అర్హులకు అన్యాయం చేసినట్లు అవుతోంది. 320 మంది అర్హులను అనటానికి గతంలో ఇచ్చిన చెక్కులే కారణం. నియోజకవర్గంలోని గురిజేపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు బొప్పాయి పంటను నష్టపరిచారు. బాధిత రైతుకు పరిహారం అందేలా చూడాలి. నియోజకవర్గ కేంద్రం యర్రగొండపాలెం నుంచి జిల్లా కేంద్రం ఒంగోలుకు నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలి. ఉపాధి హామీలో అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలి.

పర్యాటక కేంద్రంగా 'రామతీర్థం' రిజర్వాయర్

చీమకుర్తి జడ్పీటిసి వేమా శ్రీనివాసరావు

రామతీర్థం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. రిజర్వాయర్‌కు వెళ్ళే నాలుగు మార్గాలు చిల్ల చెట్లతో మూసుకుపోయాయి. మాజీ ఎంపి మాగుంట సుబ్బరామరెడ్డి పేరిట ఏర్పాటు చేసిన ఆర్చి శిథిలావస్థకు చేరింది. ముఖ ద్వార పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. చీమకుర్తి బాలికల హాస్టల్‌లో భోజనం నాణ్యతపై దష్టి సారించాలి. మరికొందరు జడ్పీటిసిలు, ఎంపిపిలు గ్రామాలలో ఫ్లోరైడ్ తాగు నీటి సమస్యను పరిష్కరించాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిన పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడాలని, శ్మశానాలలో ముళ్ళ చెట్లను తొలగించి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మండలాలలో ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచాలని కోరారు.

వ్యాపారులకు వత్తాసు

పొగాకు రైతుకు గిట్టుబాటు ధర ప్రశ్నార్థకమైంది. ఐటీసీ నేతృత్వంలో వ్యాపారుల కూటమి రైతులను ముంచుతోంది. అటు బర్లీ... వర్జీనియా పొగాకు రైతులూ ధరల్లేక ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకూ సగటు ధర పడిపోతోంది. ప్రభుత్వ రంగసంస్థలను రంగంలోకి దించాలన్నది అందరి డిమాండుగా ఉంది. వేలం కేంద్రాన్ని సందర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కూడా ఎస్టీసీకి రాష్ట్ర ప్రభుత్వమే రూ.300 కోట్లు కేటాయించాలని కోరారు. జడ్పీ సమావేశంలోనూ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు తీర్మానం చేసి పంపాలని నిర్ణయించారు. అయితే వేలం కేంద్రాల్లో కొందరు పెద్దమనుషులు వ్యాపారులకు వత్తాసుగా మారారు. ఎవరైనా వేలం కేంద్రాలను సందర్శించి రైతుల పక్షాన మాట్లాడుతుంటే వెంటనే వీళ్లే గ్రేడింగ్ సరిగా లేదని.. నాణ్యత సరిగా లేదని..వ్యాపారులకు అనుకూలంగా స్వరం వినిపిస్తున్నారు. పైగా తామూ రైతులమేనంటూ గొప్పగా చెప్పుకుంటున్నారు. వీళ్ల భాగోతం లోతుగా పరిశీలిస్తే ఎక్కడో చోట కొంత పొగాకు సాగు చేస్తారు. పరపతితో ఐటీసీ బయర్లను ఆకర్షిస్తారు. వీళ్ల బేళ్లకు మంచి ధరలు ఇప్పించుకుంటారు. అక్కడ నుంచే రైతులకు వ్యతిరేకంగానూ, వ్యాపారులకు అనుకూలంగా మాట్లాడటం వినిపిస్తోంది.

శుక్రవారం నాడు వేలం కేంద్రాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సందర్శించినప్పుడు ఆయన రైతులతో మాట్లాడుతుంటే ఓ పెద్దమనిషి మాట్లాడుతూ వచ్చిన రైతులు మంచి పొగాకును కోల్ట్‌స్టోరేజీల్లో పెడుతున్నారని, అందుకే ధరలు ఇవ్వడం లేదన్నారు. తానూ రైతునేనని చెప్పుకున్నారు. అయితే ఆయన బోర్డు సభ్యుడిగానూ ఉన్నారు. ఆయన రైతుల పక్షాన మాట్లాడకుండా వ్యాపారులకు అనుకూల స్వరం వినిపించారు. బోర్డు ఉన్నది ఎవరికోసం? రైతుల పక్షాన ఉండాలా? దాని సభ్యులు ఎవరి గురించి ఆలోచించాలన్నదే వారి విజ్ఞతకు వదిలేద్దాం. వేలం కేంద్రాల్లో కమిటీలను వేస్తారు. వీరు కూడా రైతులకు అనుకూలంగా కనిపించడం లేదు. వేలం జరిగేటప్పుడు ఒక రైతు నోరువిప్పితే నలుగురు కలిసి ఆయన నోటిని మూయిస్తున్నారు. పార్టీలను అక్కడ ప్రస్తావనకు తెస్తున్నారు. ఆయన ప్రతిపక్షం అంటూ ఏదో మాటలతో అక్కడ సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారు. ఈ వ్యవహారం అంతా రైతులకు నష్టదాయకం. వ్యాపారులకు అనుకూలంగా మారుతోంది. ఇదంతా ఐటీసీ వ్యూహం. ఇప్పటికైనా రైతులు ఇలాంటి వారిని వేలం కేంద్రాల్లోకి రాకుండా చూడాలి. ఎవరైతే వ్యాపారులకు అనుకూలంగా రైతు ముసుగులో ఉండి మాట్లాడుతున్నారో వారిని రైతులు ఐక్యంగా ఎదిరించాల్సిన అవసరం కూడా ఉంది.

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. వేసవి సమస్యలపై సాదాసీదాగా చర్చ సాగింది. మంత్రి స్వామితో పాటు పలువురు ఎమ్మెల్యేలు సమావేశానికి డుమ్మా కొట్టారు. ఎంపీ మాగుంటతో పాటు రెండు పార్టీలకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. హాజరైన ప్రజాప్రతినిధులు కొన్ని సమస్యలను ప్రస్తావనకు తెచ్చారు. తాగునీరు, ఉపాధి, వ్యవసాయశాఖలపై చర్చ సాగింది. అయితే సభకు మంత్రి స్వామి హాజరు కాలేదు. గతంలో హాజరైన మరో మంత్రి గొట్టిపాటి కూడా రాలేదు. దీంతో పాలకపక్షం గత సమావేశంలో జరిగిన పరిణామాలను గమనంలోకి తీసుకుని ఈ సమావేశం పట్ల ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. అయితే కొందరు తమ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు సమావేశానికి హాజరుకావడం గమనార్హం. ఏదేమైనా జడ్పీలో రాజకీయ అంశాలే ఎక్కువగా ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. నిధుల వినియోగం, పనులు చేపట్టే అంశంలో అధికార, ప్రతిపక్షం మధ్య ప్రచ్ఛన్న యుద్ధమే సాగుతోంది.

రాజకీయపార్టీలు తమ ఎజెండాలను వాడివేడిగా అమలు చేస్తున్నాయి. తెలుగుదేశం మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించింది. జిల్లా నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. పార్టీ శ్రేణులూ తరలివెళ్లాయి. మహానాడు విజయవంతమైందని నేతలు సంబరాల్లో మునిగితేలారు. అక్కడ సాగిన చర్చల్లోనూ, తీర్మానాలు ప్రవేశపెట్టే అంశాల్లోనూ మంత్రులు, ఎమ్మెల్యేలు కీలకంగా ఉన్నారు. ఇక వైసిపి ప్రతిపక్షంగా ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధమవుతోంది. వచ్చే నెల 4న వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పొగాకు వేలం కేంద్రం సందర్శించాల్సిన వైసిపి అధినేత జగన్‌కు వాతావరణం అనుకూలంగా లేదని వాయిదా వేసుకున్నారు.

● సీనియర్ జర్నలిస్టు అప్పారావుకు ఘన నివాళి

సీనియర్ జర్నలిస్టు, ప్రజాశక్తి ఒంగోలు ఎడిషన్ పూర్వ ఇన్‌ఛార్జి పాణకల అప్పారావు 8వ వర్ధంతి సందర్భంగా ఏడుగుండ్లపాడులోని ఎడిషన్ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాబు, సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎంఎల్‌వి.ప్రసాదరావు, బ్యూరో ఇన్‌ఛార్జి ఎస్‌వి.బ్రహ్మం మాట్లాడారు. జర్నలిస్టుగా, ప్రజాశక్తి ఎడిషన్ ఇన్‌ఛార్జిగా అప్పారావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, ఒంగోలు

ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు సిఎంగా తగడు..

- జూన్ 4న వెన్నుపోటు దినం
- వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బూచేపల్లి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా తగడని, చంద్రబాబు వెన్నుపోటు పాలనకు నిరసనగా జూన్ 4న వెన్నుపోటు దినంగా నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి శాసన సభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. శనివారం నాడు ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లాపరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రులు డాక్టర్ ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు చుండూరు రవిబాబు, అన్నా వెంకట రాంబాబు, దద్దాల నారాయణతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు మామను వెన్నుపోటు పొడిచి అధికారం చేపట్టిన చంద్రబాబు నేడు అభివృద్ధి పేరుతో ప్రజలను నమ్మించి వెన్నుపోటు పొడిచి గద్దెనెక్కారని దుయ్యబట్టారు. అమలు కాని హామీలతో ప్రజల్ని మోసగించి అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పనికిరాడని విమర్శించారు. ఈ ఏడాది పాలనలో ప్రభుత్వ పాలన పట్ల ఏ ఒక్కరూ సంతృప్తిగా లేరన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ఏ ఒక్కటీ నిలబెట్టుకోలేని అసమర్థుడు చంద్రబాబుని విమర్శించారు. అప్పుల గురించి విమర్శించే చంద్రబాబు గత ప్రభుత్వంను మించి అప్పు చేశారని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వ పాలనను నిరసిస్తూ జూన్ 4న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వెన్నుపోటు దినం సందర్భంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెన్నుపోటు దినం పోస్టర్ ను ఆవిష్కరించారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కె వి రమణారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్ తదితరులు ఉన్నారు.